


"విశ్వావసు" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

## కాంతా విరహగురుణా

- పాణిని జన్నాభట్ల (Boston, MA)

**విదిశా నగరంలో** మసకమసకగా తెల్లారుతోంది. బయట కుండలూ, ముంతలూ సర్దుకుంటున్న కుమ్మర్లనీ, పెద్ద పెద్ద బానల నిండా నెయ్యిని నింపుకుంటున్న గొల్ల వ్యాపారులనీ, మెరిసిపోతున్న కంచు గిన్నెల్ని తమ చుట్టూ పరుచుకుంటున్న వర్తకులనీ దాటుకుంటూ మెల్లగా ఆ ప్రధాన సంతలోకి అడుగుపెట్టాను.

"ఆ గోధుమ మోదకముల ధర ఎంత?", "ఈ ఆమ్ర ఫలములెంత బాగున్నాయో, ఇవెలా ఇచ్చావు?"

"అబ్బ! ఈ పట్టు లంగాలు ఎంత సున్నితంగా ఉన్నాయో...!" అంటూ అక్కడున్న దుకాణదారులతో బేరమాడుతూ ముందుకు వెళుతున్నాకానీ నా చూపులు మాత్రం పక్క కూడలి మీదున్న బళ్ళ మీదే ఉన్నాయి. ఇక్కడ బండి ఎలా కట్టించుకోవాలో అర్థం కావట్లేదు. ఒంటరి ఆడపిల్ల అడిగితే అసలు కడతారా ఎవరైనా? ఒకవేళ కట్టినా, సరిగ్గా తీసుకుపోతారన్న నమ్మకమేమిటి? ఈ సారీ ఉజ్జయినికి పోలేనా అయితే? నిస్సత్తువ ఆవరిస్తోంది.

అసలెందుకు ఇదంతా వదిలేసిపోవడం మళ్లీ? వదిలేసి పోవడమేముంది, వదిలేసిన చోటికేగా పోతుంటా!

అలా నిలబడి పశ్చిమం వైపుకి పోతున్న రహదారినే చూస్తున్న నన్ను ఆప్యాయంగా పలకరించిందో గొంతు, "ఏమ్మా నగరానికి కొత్తా?" అని. ఆ మాటతో పాటే గుప్పుమని తమలపాకు ఘాటు కూడా వచ్చింది. వెనక్కి తిరిగి చూస్తే, ఎర్రటి బొట్టు, ఎర్రటి పెదాలు, ఎర్రటి నాలుకా! ఒకేసారి భయం, గౌరవం రెండూ కలిగాయి ఆమెని చూస్తుంటే.

"ఎక్కడిదాకా ఏమో?" అంది పక్కనున్న చెట్టు కింద కూర్చుంటూ ఆమె.

"ఉజ్జయినికి వెళుతున్నామండీ!" అన్నాన్నేను.

"ఏడీ, నీ యజమాని కనపడడే మరి?" అంది అనుమానంగా అటూ ఇటూ చూస్తూ.

"అయ్యో వారు వస్తార్లే, మీరు వెళ్ళండమ్మా. ఏదో పనిలో ఉన్నట్టున్నారు." ఓ సారి నా ముఖం నుండి పాదాల దాకా పరీక్షగా చూసింది ఆమె. సింధూరం లేని తలా, బోసి మెడా, మాసిపోయిన లంగా. సువాసినులకుండే లక్షణాలు ఏవీ కనపడట్లేదు నాలో. పైగా కాళ్ళ పక్కనే పడున్న నా బట్టల మూట!

"చూడమ్మాయ్, మొగుళ్ళెవరూ పెళ్ళాల్ని ఇలా కూడళ్ళలో వదిలిపోరు కానీ, నేనూ ఉజ్జయినికే పోతున్నా, వస్తావా నాతో?" అంది తమలపాకు నములుతూనే.

"మీకెందుకండీ శ్రమ, నేను వేరే బండిలో..."

"ఏదో ఆడబిడ్డవి కదా, ఒంటరిగా వదిలి పోబుద్ధికాక అడిగాన్లే."

"అది కాదు. మా వారు..."

"ఆ ఎద్దుల బళ్ళల్లో ఏం పోతావులే గానీ, నా దగ్గిర గుర్రం బండుంది. చూస్కో మరి!" అంది కళ్ళెగరేస్తూ..

అలానే నిలబడ్డాను నా లంగా నాడాని వేలితో తిప్పుకుంటూ...

"సర్లే నీ ఇష్టం." లేచి బండివైపు వెళ్లిపోతోందామె.

నాకేం తోచలేదు. చుట్టూ చూశాను. ఒంటరితనం మళ్లీ కమ్ముకుంటోంది.

"ఆగండమ్మా! నేనూ వస్తాను..." మూట తీసుకుని పరిగెత్తాను వెనకే.

బళ్ళోకి ఎక్కి సర్దుకోగానే నవ్విందామె. నా గడ్డాన్ని అటూ ఇటూ తిప్పి ముఖం అంతా పరీక్షగా చూసింది. నా చేతులూ, వేళ్లూ తడిమింది, అరచేతులు నొక్కింది, జుట్టు సర్దింది. చివరికి నా రవికె మీదకి వెళ్ళబోయాయి ఆమె చేతులు. నేను సిగ్గుతో వెనక్కి జరుగుతూ "మీరూ...మీ పేరు?" అన్నాను.

"రత్నమాంబ అంటార్లే, విదిశలో నా పేరు వినని మగాడుండడు." అంది.

"అయ్ బాబోయ్, తమరు తెలీనోడెవడండీ!" అన్నాడు బండివాడు నవ్వుతూ.

"ఆట్టే వాగక బండి తీయవోయ్! కర్పూర హారతివ్వాలా ఏ..." అంది కోపంగా.

తడబడి ఒక్కసారిగా గుర్రాల్ని అదిలించాడు వాడు. ఉజ్జయిని వైపు పరుగందుకుంది మా బండి.

"కొత్త సేప పడినాదిరోయ్ వలలో!" సంతలో ఎవరో అరిచారు పెద్దగా. విరగబడిన నవ్వులు చుట్టూ.

నీళ్ళు లేని భూమి మీద వలేమిటో, చేపలేమిటో!

★★★

"ఏంటి నీ కథ ఇంతకీ?" నింపాదిగా అడిగిందామె బండి వెళుతున్నప్పుడు.

"నాది మాధవపురమండీ. ప్రభువు వీరదత్తుడి ఇంట్లో ఉంటున్నాను."

"మరిందాక మొగుడున్నాడన్నావ్!" అంది కళ్ళల్లోకి చూస్తూ.

తప్పే, కానీ దానిని మళ్లీ ప్రశ్నించటం ఎందుకట అన్నీ తెలుస్తూ ఉన్నా. నోరు మెదపలేదు నేను.

"సర్లే, నీ రహస్యాలు నీవి. నా రహస్యాలు నావి. చెప్పుకోవద్దులే." అంది మూతి తిప్పుతూ.

రహస్యాలు...! జీవితంలో కొన్ని రహస్యాలుంటే చెప్పచ్చు, మొత్తం జీవితమే ఓ రహస్యమైతే?

"వీరదత్తుడంటే ఆ ప్రాంత ధాన్యాగార ప్రముఖుడు కదూ? నాకెందుకు తెలియదు. మొండి ఘటం. బొత్తిగా రసికత్వమే లేదు మనిషిలో..." అంది. "అయినా అదీ ఒకందుకు మంచిదేలే నీకు..." తనే అంది మళ్లీ నా బుగ్గలు చిదుముతూ.

"వారి భార్య అంబికాదేవి చాలా మంచివారండీ. నన్ను సొంత కూతురిలా చూసుకున్నారు."

"మంచో, జాగ్రత్తో, అందగత్తెని ఇంట్లో పెట్టుకున్నానన్న భయమో..."

ఏమిటో, ఈవిడ చేష్టలూ, మాటలూ నాకస్సలు అర్థం కావట్లేదు. కాకపోతే ఈమె దగ్గరేం దాచలేనని మాత్రం అర్థమైంది.

"ఏం సేవలు చేయించుకుంటుందో నీ చేత?"

"వారి పిల్లలకి నాట్యం నేర్పుతుంటానమ్మా."

"ఆహా... సంతలో నీ సౌష్టవం చూసినప్పుడే అనుకున్నా, నడకలోనే భలే నాట్యం పలుకుతోందే పిల్లకీ అని..."

సౌష్టవం. ఇదేం సౌష్టవం? మహారాజు చంద్రగుప్తుని సభలో మా బృందం నాట్యం చేసిన రోజుల్లో చూసుండాలి, కళ్ళు తిరిగేవి కాదు సభికులవి.

"ఎందుకో ఈ ప్రయాణం హఠాత్తుగా?"

"ఓ చిన్ననాటి మిత్రుడిని కలవడానికి వెళుతున్నానండీ."

"ఇహ మిత్రుడనటం ఎందుకులే, ప్రియుడనే అను, నీ వయసుకి తగ్గట్టుగా. నాదగ్గర దాపరికాలెందుకు?"

ముసిముసి నవ్వులు నవ్వాడు బండివాడు.

"అబ్బ మీరేమిటండీ, ఆవులించకుండానే..."

"అండీ ఏమిటి అండీ, పిన్నీ అను ఇక."

"సరే పిన్నీ!"

"ఎంత మందిని చూసుంటా నా జీవితంలో? నిన్ను చూస్తే పల్లెటూరి పిల్లలా లేవు. ఆ సున్నితత్వం చూస్తే కాయకష్టం అంటే తెలియని దానిలా ఉన్నావు. నర్తకివంటే ఏ రాజాస్థానం లోనో, దేవదాసిగా కొలువులోనో, లేక...ఏ దండనాయకుడి ఉంపుడుగత్తెగానో..."

"పిన్నీ! దయచేసి అలా అనవద్దు."

"తప్పేముందమ్మా, ఒంటరి స్త్రీగా బతకాలంటే ఏదో పంచన చేరాల్సిందేగా..."

ఆమె మాటలకి తెలియకుండానే దుఃఖం ఉబికివస్తోంది నాలో. ముడుచుకున్న కాళ్ళ మధ్యలో తల దాచుకున్నాను. మెల్లగా చుట్టూ చీకటి అలుముకుంటోంది. కలలాంటి నిజం కళ్ల ముందుకి తేలుతూ వచ్చింది.

*"అయితే వదిలి వెళ్లిపోమంటున్నావా నన్ను?" అన్నా నేను దెబ్బతిన్నట్టు. "ఛ ఛ నేనలా అంటానా చారూ? అనగలనా అసలు?" ఒడిలో పడుకున్న నన్ను ఊపుతున్నాడు.*

*"ఏమో, అలాగే వినిపిస్తోంది నీ మాట మరి!" తల పైకెత్తి చూస్తున్నాను కళ్ళల్లోకి.*

*"పిచ్చీ, నీవు లేకపోతే నాకు ప్రేమ గురించే అసలు తెలియకపోదును."*

*"ఆహా...ఇప్పుడది తెలిసి పోయింది కనక విరహం కావాలనుకుంటున్నావు."*

*అతడేమీ అనలేదు. శిప్రా నది మమ్మల్ని గమనిస్తూ పక్కనే మెల్లగా పారుతోంది.*

*నేను విసుగ్గా లేచాను, నదిలోకి నడుస్తున్నాను. వెనకనుండి అరుపులు లీలగా వినిపిస్తున్నాయి.*

*నేనలా పోతూనే ఉన్నాను చీకటిలోకి...నిశ్శబ్దంలోకి...*

"ఇంద, మోదకాలు తీసుకో, ఓయ్ పిల్లా!" అరుపు. ఉలిక్కిపడి లేచాను.

ఒక పాత్ర తెచ్చి నా ముందు పెట్టింది రత్నమాంబ. తటపటాయించాను. నా అరచేతిని బలవంతంగా చాచి లడ్డూ ఒకటి పెట్టింది.

"తినవమ్మా. చాలా ఫలహారాలు తెచ్చాను. ఇంతకీ ప్రియుడితో ఉజ్జయినిలో ఉండిపోవడమేనా, మళ్లీ మా విదిశకి వచ్చేది ఉందా?"

"అతడు కలిశాకే తెలియాలి పిన్నీ." అన్నాను. నిజం కూడా అది.

"అసలెందుకు విడిపోయినట్టో..." ఇంకో తమలపాకు తీస్తూ అంది.

"ఏవో గొడవలు. మీకు తెలియనిది ఏముంది?" దాటవేయబోయాను.

"పిచ్చి పిల్లా, గొడవలొస్తే మరో ప్రియుడిని చూసుకోవాలి గానీ, అన్నీ వదిలేసి తిరుగుతావా ఏంటి?"

నవ్వాను. అంత సులభం ఈమెకి.

"ఎక్కడ కొలువు నీ ప్రియుడిది?"

మౌనంగా ఉన్నా. నా రహస్యాలు నావి అంది కదా. ఈ ఆరాలెందుకో.

"గడుసుదానివే. ప్రియుడి గురించి మాత్రం ఏమీ పలకట్లేదు చూడు ఆ పెదవులు!" బుగ్గ మీద నొక్కింది. నా కళ్ళలో నీళ్లు తిరుగుతుంటే, ఇక రెట్టించకుండా ఊరుకుంది. ఇంకొంచెం గట్టిగా అడిగితేనే బావుణ్ణనిపిస్తోంది నాకు. కొంచెమే. నాకెప్పుడూ అంతా చెప్పెయ్యాలనే ఉంటుంది. కానీ నన్నా వంతెన దాటించలేకపోయారెవ్వరూ. చేతిమీద చటుక్కున కొట్టినా చాలు. వాసంతిక కొట్టినట్టు. నాట్యాభ్యాసం పూర్తి చేసుకుని రాజ నర్తకి అయ్యే ఉంటుంది ఈ పాటికి. పాపం, ఒదిలొచ్చి దాన్నెంత బాధ పెట్టానో...

బండి వెళుతూ ఉంది. పొలాలూ, పశువులూ మాకు వ్యతిరేకంగా పరుగెడుతున్నాయి. మమ్మల్ని దాటి ముందుకి వెళుతున్న గుర్రపు బండిలో ఓ పెళ్లి కొడుకూ, పెళ్లి కూతురూ కనపడ్డారు. సిగ్గుపడ్డాను వారిని చూస్తూ. నాకసలు కళ్యాణయోగం ఉందో లేదో? నిజంగా అమాయకురాలినే నేను. ఏం బావుకున్నాను జీవితాన్నిలా అర్థాంతరంగా పారేసుకుని.

హఠాత్తుగా ఆ దారిలో ఓ పక్కగా ఆగిపోయున్న బండి మీద పడ్డాయి నా చూపులు. తలపాగా ఉన్న శ్రేష్ఠి గారు ఓ చెట్టు కింద కూర్చుని ఉన్నారు. వారి బండి చక్రం విడిగా పక్కన పెట్టి ఉంది. వారి బండివాడు ఏదో పని చేస్తున్నాడు దాని మీద. "బండి ఆపండి, త్వరగా!" అరిచాను. ఆగింది మా బండి. ఏమైందన్నట్టు తొంగి చూసింది రత్నమాంబ. "అవన్నీ మనకెందుకమ్మా, బందిపోట్లుంటారు మారు వేషాల్లో." అంది. ఇలానే అనుకుని ఆ తల్లి అంబికాదేవి నన్నారోజు వదిలేసిపోయుంటే? రత్నమాంబని పట్టించుకోకుండా బండి దిగి, ఆమె చేతిలో ఉన్న తమలపాకుల పళ్ళెం తీసుకుని శ్రేష్ఠి గారి దగ్గరికెళ్ళాను.

★★★

"మంచి పెంపకం అమ్మణీ నీ కన్నవారిది." అన్నారు శ్రేష్ఠి నాతో పాటు మా బండి దగ్గరికొస్తూ.

రత్నమాంబ దిగి వంగి నమస్కరించింది.

"వారి బండి చక్రం హఠాత్తుగా విరిగిందట, మన బండిలో రమ్మని ప్రార్థించాను. ఉజ్జయినికే" అన్నాను.

"మహా కాళేశ్వరాయనమః" అన్నారు శ్రేష్ఠి చేతులు జోడించి పైకి చూస్తూ. మా ఉజ్జయినీవాసులకిది అలవాటే. దుఃఖాల్నీ, బాధల్నీ, ఆశల్నీ, చివరకి ఆనందాల్నీ దేవుడి పేరుతో అనుభవించడం.

ఆయన బండివాడు, "ఆయ్ జాగర్తండీ, ఉజ్జయిని నగరశ్రేష్టులండీ, భద్రం." అని చెప్పి వెనక్కి వెళ్లిపోయాడు. రత్నమాంబ ఏదో పూనకం వచ్చినట్టు కదిలిపోయింది అది విన్నాక.

"అంతా మా భాగ్యం ప్రభూ! తమరిని ఆహ్వానించమని ఈ పిల్లని పురమాయించిందే నేనే. పెద్దవారిని సేవించుకోవడం కంటేనా." అంది. సన్నగా నవ్వుకున్నాను ఆమె హడావిడిని చూసి.

బండి అంచు దగ్గర కూర్చున్నారాయన. చర్నాకోల విసిరాడు మా బండివాడు గుర్రాల మీద.

"నీ కూతురా ఈ అమ్మణి?" అడిగారాయన రత్నమాంబని పరీక్షగా చూస్తూ.

"చిత్తం, అలాంటిదే అనుకోండి." అంది ఆమె రవికె మీద ఉత్తరీయం సర్దుకుంటూ.

"ఈ ప్రాంతంలో చూడలేదే ఇదివరకు?"

"మాది విదిశా నగరం ప్రభూ. రత్నమాంబ అంటారీ దీనురాలిని."

"ఓహో, మరి అక్కడ అంత దివాణం ఒదిలేసి ఇటువైపెందుకో ఈ ప్రయాణం?"

ఈయనకీ తెలుసా ఈమె? ఏమో మగాళ్ళకి బాగా తెలుసనే అంది కదూ!

"నా కష్టాలేమని చెప్పనయ్యా. ఉజ్జయిని ప్రముఖులు విష్ణుసేనుల వారి నుండి నాకు చాలా పైకం రావలసి ఉంది. రెండు వర్షాకాలాలు దాటినా ఒక్క వెండి నాణెమైనా రాలలేదు. ఇక లాభం లేదని నేనే వస్తున్నాను."

"మా విష్ణుసేనుడూ పడ్డాడూ నీ ఉచ్చులో..."

"అయ్యో, వారే వచ్చారు. మేము తాంబూలమిచ్చి రమ్మనలేదయ్యా."

నా వైపు చూశారు శ్రేష్ఠి. "ఈ అమ్మణిని ఎక్కడికి తీసుకుపోతున్నట్టు?"

"ఒట్టి అమాయకురాలు. ప్రియుడిని ఒదిలి పారిపోయిందట, మళ్లీ కలవడానికి ఉజ్జయినికి పోతున్నదట."

"ఎవమ్మా, ప్రియుడితో కలిసి పారిపోవడం విన్నా గానీ, ఇదేమిటీ? ఎవరతగాడు?"

నా దగ్గర సమాధానం లేదు.

"అలా అడగండి. నాకు తెలుసు చిన్నా పెద్దా అందరూ అంటే నోరు మెదపదీ పిచ్చి మొద్దు."

"నీకన్నీ తెలుస్తాయిలే రత్నమాంబా, వచ్చే జనాలూ, పోయే జనాలూ!" అన్నారు శ్రేష్ఠి. నవ్వింది ఆమె కూడా.

"ఈ అమ్మణి ప్రియుడు కనుక ఒకవేళ దొరక్కపోతే, మా ఇంట్లో దించు. కూతురిలా చూసుకుంటుంది నా భార్య." అన్నాడు.

"పెద్దలు, తమరు నా పొట్ట కొట్టద్దు. నేనే విదిశకు తీసుకుపోతాను." అంది చేతులు జోడిస్తూ.

ఎవరి ఇష్టాలు వారివి, నాతో ఏ సంబంధమూ లేనట్టు! ఓ రేణువంత కూడా అర్థమవ్వదీ ప్రపంచం నాకు.

ఓ మలుపు తిరిగింది మా బండి. ఎర్రటి ప్రాకారాలూ, ఎత్తైన భవనాలూ కనపడ్డాయి దూరంగా. ఉజ్జయిని! వాటికి దగ్గరవుతున్న కొద్దీ, తల్లి ఒడిలోకి వెళుతున్నవెచ్చని హాయి నాలో. నగర శివారుకి రాగానే, బాగా పరిచయమైన గాలొకటి వచ్చి నన్ను గట్టిగా కౌగిలించుకుంది. చిన్నప్పటి నుంచీ నాతో తిరిగిన గాలి, నేను వదలిపోయినపుడు కన్నీరు పెట్టుకున్న గాలి. వస్తూ వస్తూ తెలిసిన వాసనలూ తెచ్చింది దానితో పాటు. గుట్టలుగా పోసున్న సుగంధ ద్రవ్యాలూ, ధాన్యపు రాశులూ, తోలు చర్మాలూ, పరిమళ ద్రవ్యాలూ అన్నీ గమ్మత్తుగా కలిసిపోయి నా నుంచి దూరంగా పోయిన ఉజ్జయినిని మళ్లీ గాఢంగా నా ఊపిరిలో నింపుతున్నాయి. వీధులు మారుతోంది మా బండి. తల నుండి పాదాల దాకా తెల్లటి వస్త్రాలు ధరించిన వర్తకులూ, పైన ఉత్తరీయం కూడా లేని దృఢకాయులైన దక్షిణభారత వ్యాపారస్తులూ, పూలముద్రల్లో మెరుస్తున్న వస్త్రాలు ధరించిన చీనీ దేశపు స్త్రీలూ... ఈ విశాల ప్రపంచానికి చిన్నపాటి నమూనాల్లా కనిపిస్తున్నాయా కూడళ్ళు. కొత్త కొత్త భవనాలనీ, దుకాణాలనీ చూస్తూ నాలుగేళ్ళ క్రితం అక్కడ ఏమి ఉండి ఉండేదా అనే కుతూహలంలో మునిగిపోతున్నాను.

"స్వర్ణకారుల సందులోకి తిప్పవయ్యా!" అరిచారు శ్రేష్ఠి గారు మా బండివాడిని. అటు తిరిగి కొంత దూరం వెళ్లగానే, ఆ మార్గం అంతా బళ్లతో నిండిపోయి ముందుకి కదలడానికి లేకుండా ఉంది. ఆ ముందు ఏదో కోలాహలంగా ఉంది కానీ ఏం జరుగుతోందో మాత్రం తెలియడం లేదు. "ఏమైంది శ్రేష్ఠిగారూ? ఉజ్జయిని విషయపతి ఎవరైనా వస్తున్నారా ఇటుగా?" అంది రత్మమాంబ. నవ్వారాయన పెద్దగా. "ఊరేగింపేదో వెళుతున్నట్టుంది."

నేను ముందు నుండే బండి కిందకి దిగేశాను. ఉత్సాహంగా బళ్ళన్నీ దాటుకుంటూ ఆ వీధి మొదటికొచ్చాను. దానికి కలుపుతూ ఉన్న రాజ వీధిలో నిజంగానే ఓ పెద్ద ఊరేగింపు. దండధారులైన నలుగురు సైనికులు ముందు నడుస్తుండగా, వారి వెనకనే రకరకాల సంగీత పరికరాలు వాయిస్తున్న వాద్య బృందం వెళుతోంది. వారి వెనకాల రంగురంగు పట్టు వస్త్రాల్లో, తుళ్ళుతూ వెళుతున్న నర్తకీమణులు. ఆ వెనకే బంగారు రంగులో నావలా ఊగుతూ వస్తున్న ఓ పల్లకీ! వీధికి అటూ ఇటూ ఉన్న జనాల నుండీ అమాంతం ఆ పల్లకీ మీదికి ఎగుస్తున్న పూలజల్లులు!

నా ముందు నిలుచున్న పెద్దమనిషి భుజంమీది పిల్లవాడు అరిచాడు హఠాత్తుగా,

"అయ్యా! కాలిదాసు...కాలిదాసు పోతన్నాడు..."

నా గుండె ఆగినట్టయ్యింది. ఏమన్నాడు?!

చటుక్కున శ్రేష్ఠి వైపు తిరిగింది నా తల. అవునన్నట్టు తలూపాడతను.

"ఎంత భోగం, ఎంత భోగం!" అని బుగ్గలు నొక్కుకుంటోంది రత్నమాంబ.

"ఈ మాత్రానికేనా, ఆ పల్లకీని మోస్తున్న బోయీలెవరనుకున్నావు?" అన్నాడు శ్రేష్ఠి రహస్యమేదో విప్పుతున్నట్టు.

"కొంపదీసి చక్రవర్తి గారి బోయీలా!"

"హ హ కాదు. ఉజ్జయిని చుట్టుపక్క ప్రాంతాల విషయపతులు!"

"ఏవిటీ! అంతపెద్ద అధికారులు ఓ కవిని పల్లకీలో మోయడమే! ఎక్కడా వినని, కనని విడ్డూరవమ్మా."

"ఆ పల్లకీ ముందు దండధారుడై దారి చూపుతున్నాడే, అతడే వారి నాయకుడు, ఈ ప్రాంతపు భుక్తి పతి!"

తేనె! తేనె ప్రవహిస్తున్నట్టుంది నా సమస్త అణువుల్లో ఆ మాటలు వింటుంటే. గర్వంతో ఎగసిపడుతోంది ఛాతి. ఏదో తెలియని అలజడితో సన్నటి ఒణుకు మొదలైంది. చేతులు రెండూ పిడికిలిగా చేసి గట్టిగా అదుముకుంటున్నాను. ఇంతటి ఖ్యాతి! నా కాళిదాసుది అంటే నాది కూడా కదా. ఆ పల్లకిలో కాళీ పక్కనే నేనూ ఉన్నట్టు ఊహించుకున్నాను. ఛ ఊహలెందుకు? రేపటినుండీ ఇవన్నీ వాస్తవాలు కాబోతుంటే!

పల్లకీ దాటిపోయింది. ఒక్కసారి మెరుపు మెరిసి చీకటిపడినట్టయ్యింది, భానుడింకా ఆకాశంలో ఉండగానే. అందరూ వెనక్కి తిరిగారు దిగులుగా.

"దీపశిఖా కాళిదాసు అని ఊరికే అన్నారా...", "ఒసారి రాజసభలో చూశాను కవి గారిని, ఏమి వర్చస్సో..."

"మరి రాత్రి పూట వారి నాటకానికి వెళుతున్నావా? దుకాణం కట్టిపెట్టి వెళ్ళు ఈ సారైనా..."

వీధంతా ఖాళీ అయ్యింది ఏదో వేడుక ముగిసినట్టు.

"దయచేసి ఆ నాటకానికి తీసుకుపోగలరా నన్ను?" ప్రాధేయపడుతూ అడిగాను శ్రేష్ఠి గారిని తిరిగి బండెక్కుతున్నప్పుడు.

"అదే చేత్తో ఈ దీనురాలిని విష్ణుసేనుల వారి ప్రాసాదానికి కూడా..." అంది చేతులు జోడిస్తూ రత్నమాంబ.

"ఆ నాటకానికి మా వర్తక సంఘమంతా వెళుతున్నది. విష్ణుసేనుడు కూడా వచ్చే అవకాశం ఉంది కానీ అందరినీ అనుమతించరే..." అన్నారు సందేహంగా.

"బాబ్బాబు... మీరే కనికరించాలి."

"సరే, మా పరివారమేనని చెప్పి మిమ్మల్ని కూడా తీసుకువెళతానులే." అన్నారాయన ఒప్పుకుంటూ.

తర్వాత నా వైపు చూశారు వారిద్దరూ 'ఇంతకీ నీ ప్రియుడెక్కడ?' అన్నట్టు.

"వారూ అక్కడికి రావచ్చును." అన్నాను కళ్లల్లో మెరుపు నింపుకుని.

"అతడో నాయకుడూ, ఇదొక అభిసారికా!" దెప్పింది రత్నమాంబ.

అవును. నేను అభిసారికనే. కాళీని రహస్యంగా కలవాలి, నా తప్పు మన్నించమని ప్రార్థించాలి.

ఎదురుగా ఉన్న దేవాలయంలో గణగణమంటూ హారతి గంటలు మొదలయ్యాయి. ఓం మహాకాళేశ్వరాయనమః

మెల్లగా సభా ప్రాంగణం చేరుకున్నాం. దానికి తూర్పు వైపు పెద్ద వేదిక కట్టి ఉంది. కొందరు ప్రభువులూ, అధికారులూ, శ్రేష్ఠులూ ఎదురుగా రకరకాల ఆసనాల్లో కూర్చుని ఉన్నారు. వారి పరివారం, సేవకులూ కొంత దూరంగా కింద కూర్చుని ఉన్నారు. రత్నమాంబ గట్టిగా నా చెయ్యి పట్టుకునే ఉంది నెనెక్కడా తప్పిపోకుండా. లోపలికి వెళ్ళాక మా శ్రేష్ఠి, వారి ఆసనం పక్కగా కింద కుర్చోమని సైగచేశారు. అదే సమయంలో, "చారులతా, చారులతా!" అని గట్టిగా ఎవరో పిలుస్తున్నారు. చటుక్కున వెనక్కి తిరిగాను. గుండె అదురుతోంది. లేదు, వేరెవరినో పిలిచినట్టున్నారు. నన్నెవరు పిలుస్తారు? అదీ ఇన్నేళ్ళ తర్వాత. నా పేరుకి కూడా భయపడే పరిస్థితి నాది. నాదో విచిత్రమైన జీవితం. ఓ రహస్యాన్ని నాకు నేనే సృష్టించుకుని, అది బయటపడుతుందేమోనని భయపడుతూ బతకడం!

ఉన్నట్టుండి భేరీ నాదం వినపడింది వేదిక నుండి. ఆ ప్రాంగణమంతా నిశ్శబ్దంగా మారింది. చకచకా వేదిక పైకి నడుచుకుంటూ వచ్చి నిలబడ్డాడొక సూత్రధారుడు. సన్నగా, ఠీవిగా ఉన్నాడు. తెల్లటి తలపాగా, గుబురుగా పెరిగిన నల్లటి గడ్డం. దీపకాంతుల మధ్యకి రాగానే బంగారు వర్ణంతో, ఉజ్జ్వలంగా మెరుస్తున్న అతని ముఖాన్ని చూసి నా హృదయం ఆనందంతో ఎగసిపడింది. సరికొత్తగా కనిపిస్తున్న కాళీ! అతడి రూపాన్ని మెల్లగా నాలో నింపుకుంటూ ఉండిపోయానలా.

ప్రసన్నంగా అన్నివైపులకీ చూస్తూ హుందాగా చేతులాడిస్తూ, తన నాటకాన్నీ, పాత్రలనీ పరిచయం చేస్తున్నాడిప్పుడు. నాకదంతా దూరాన వీస్తున్న హోరుగాలిలా వినిపిస్తోంది. పైకీ కిందకీ ఆడుతున్న అతడి చేతులూ, చకచకా తిరుగుతున్న కాళ్లూ, రకరకాలుగా కదులుతున్న నోరూ, విసురుగా ఊగుతున్న కేశాలూ... నా నాటకమదే, నన్ను కట్టిపడేస్తున్న పాత్రలవే!

హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్న అతడి కళ్ళనే గమనిస్తున్నాను. అవి చూడటం లేదు, దేనినో గాలిస్తున్నాయి! హఠాత్తుగా నా వైపు తిరిగాయి. చటుక్కున తల దించుకున్నాను. ఛ, చీకటిలో ఉండి ఉండవలసింది. కొంతసేపటికి పైకెత్తి చూస్తే, వేదిక దిగి వెళ్లిపోతున్నాడు. ఓ పెద్ద అల వచ్చి నా దేహాన్ని అమాంతం పైకెత్తి కింద పడేసి పోయినట్టుంది. పరిగెత్తి అతని వెనకాలే వెళదామనుకున్నా కానీ రత్నమాంబ చేతిలో నా చెయ్యింకా ఇరుక్కుపోయే ఉంది!

అతడు వెళ్లిన మరుక్షణం వాసంతిక మెరిసింది వేదిక మీద. జీవితంలో నాకున్న ఒకే ఒక్క సఖి. నాటకాలలోకి వెళ్లిందన్నమాట అయితే. కళ్ళార్పడం కూడా మరచిపోయాను దాన్ని చూసి. శకుంతలలా ఆడింది, పాడింది, తుళ్లిపడిందది ఆశ్రమవాసి రూపంలో. దుష్యంతుడూ వచ్చాడు అడవికి. ఎన్నో ఊసులు చెప్పుకున్నారిద్దరూ కానీ హఠాత్తుగా ఒక రోజు మాయమయ్యాడు. భారంగా జీవిస్తోంది శకుంతల అతడు వదిలి వెళ్లాక. ఏం చూసినా, ఎవరు పలికినా దుష్యంతుడే అనుకుంటోంది పాపం. ఒక రోజు పారుతున్న నీటితో

మాట్లాడింది, మరో రోజు కదిలిపోతున్న మేఘానితో తన బాధ చెప్పుకుంది, ఆ
తర్వాత ఓ పెద్ద చెట్టుని కౌగిలించుకుని ఏడుస్తూ కూర్చుంది. ఆశ్రమంలోని ప్రతి జింకకీ, కుందేలుకీ తెలిసిపోయింది ఆమె బాధ. విరహానికో నిలువెత్తు రూపం ఆమె ఇప్పుడు!

*"విరహాన్నెలా చారూ వ్రాయడం! నా వల్ల కావట్లేదు." అన్నాడు కాళీ ఆ రోజు.*

*"ప్రేయసి పక్కనే ఉంటే గొప్ప కవులు కాలేరు కాళీ." అన్నానేను ఆటపట్టిస్తూ.*

*"అయితే ఇక ఎప్పటికీ రాయలేనేమో." అన్నాడు బాధగా తను శిప్రా నది వైపు చూస్తూ.*

అంటే, నేను చూస్తున్నది మా కథేనా? వదిలిపోయిన దుష్యంతుడు నేనూ, విరహబాధతో వేగుతున్న శకుంతల కాళిదాసూనా!

శకుంతల ఏడుస్తోందిప్పుడు, నువ్వెవరో నాకు తెలియదంటున్నాడు దుష్యంతుడు. ఆమె బ్రతిమిలాడుతోంది. బైటికి పొమ్మని అరుస్తున్నాడతడు. కాళీ ఇలా రాశాడా? ఇంత కర్కశంగా రాశాడా! నాకు తెలియకుండానే కళ్ళు ధారలు కట్టాయి. నా వెనకాల పెద్దగా రోదిస్తున్నదొకామె, పక్క ఆసనం మీదున్న ప్రభువు ముక్కు ఎగబీలుస్తున్నారు. ఓ వృద్ధురాలు గుసగుసలాడుతూ శాపనార్థాలు పెడుతోంది. చుట్టూ తలతిప్పి చూశాను. అదో శోక సంద్రం.

"ఏడవకులే, కలుసుకుంటారులే చివరికి...ఊరుకో..." అంటున్నాడు నా ముందు కూర్చున్న ప్రియుడు గుక్కపెడుతున్న తన ప్రేయసితో.

ఆ క్షణం, అదే క్షణంలో అర్థమైంది నాకు, కాళీని వదిలిపోయి నేనే తప్పూ చేయలేదని. ఓ మహాకవి ఆవిర్భావానికి హేతువయ్యానని. నేననుకున్నది సాధించగలిగానని!

ఇది నా కావ్యం. నా విజయం.

కళ్ళు తుడుచుకున్నాను. క్షణం కూడా ఆగలేనిక. వెంటనే కాళీని కలుసుకోవాలి, అతని కౌగిలిలో ఒదిగిపోవాలి. బలంగా చెయ్యి విడిపించుకుందామని తడిమి చూస్తే రత్నమాంబ నా పక్కన లేదు! అటూ ఇటూ చూశాను. దూరంగా ఎవరో ప్రభువు ఆసనం పక్కన కూర్చుని అతడి కాళ్ళు పడుతోంది, మెడపట్టుకు బాకీ వసూలు చేస్తానన్న రత్నమాంబ! తల పైకెత్తి అతడితో దీనంగా ఏదో మాట్లాడుతున్నట్లుంది. నా హృదయం కలుక్కుమంది.

"ఈమె నుండి వీలైనంత దూరంగా పారిపో అమ్మణీ." శ్రేష్ఠి గారు బండిలో నాతో రహస్యంగా అన్న మాట. కానీ ఎలా? ఆమె నాకు సహాయం చేసిందే బండిలో తీసుకొచ్చి. నేనూ శ్రేష్ఠి గారికి సహాయపడ్డాను ఉజ్జయినికి తీసుకొచ్చి, ఆయన ఆమెకి సాయపడ్డారు విష్ణుసేనుడిని చూపించి...

నా ఋణం తీరిపోయినట్టేనా అయితే? అమాంతం పైకి లేచాను.

వేదికకి వెనకనున్న విశాలమైన మైదానంలో నడుస్తున్నాను. దూరంగా కొన్ని గుడారాల ముందు కాగడాలు వెలుగుతున్నాయి. సైనికులు అటూ ఇటూ తిగుతున్నారు.

ఇన్నేళ్ళ తరువాత తనకి ఎదురుపడితే కాళీ ఏమంటాడో? దుష్యంతుడిలా నానా మాటలంటాడా? పల్లకీ మోయించుకున్న దర్పం నా మీద చూపిస్తాడా? తన సైనికులతోనే నన్ను బైటికి గెంటేయిస్తాడా?

ఛీ, పిచ్చి ఆలోచనలు. ఇందాక నాటకం ముందు నా వైపే ఆశగా చూడలేదూ? నా గురించే ఆలోచిస్తున్నట్టూ, ఎదురు చూస్తున్నట్టూ కనపడలేదూ? అంతే, అంతే. లేకపోతే అసలింతటి విరహకావ్యం ఎలా రాయగలడు? తనలోని రసాన్ని ఘంటంలో పూరించి రాసినట్టు?

దుష్యంతుడైనా శకుంతలని పొరపాటున మరచిపోయాడేమో కానీ కాళిదాసు మాత్రం నన్ను మరచిపోలేదు, మరచిపోలేదు. వెయ్యి ఏనుగుల బలం వచ్చిందా ఆలోచనకి. పరిగెడుతున్నానిప్పుడు.

ఓ పెద్ద గుడారం ముందున్న భటుల దగ్గరికెళ్ళాను. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు వాళ్ళు.

"మహాకవిని కలుసుకోవాలి. ఆయనకోసారి కబురు పెడతారా చారులత వచ్చిందని?" అన్నాను ఆయాసపడుతూ.

"ఆ అవసరం లేదు తల్లీ. ఎవరైనా స్త్రీ మూర్తి కలవాలని వస్తే, తక్షణం తన వద్దకి పంపమని ఆదేశించారు కవివర్యులు." అన్నాడొక భటుడు గుడారం వైపు చేయి చూపిస్తూ. సీతాకోకచిలుకలా రెపరపలాడింది నా హృదయం. ఇంత ప్రేమా? ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా! వడివడిగా అడుగులేశాను కానీ మళ్లీ గుడారం బైటే ఆగిపోయాను సంకోచిస్తూ. పేద కాళిదాసుని వదిలిపెట్టి, గొప్ప కాళిదాసుని వెతుక్కుంటూ వచ్చానని అవమానిస్తుందేమో లోకం? భయంగా ఉంది.

లోపలి నుండి ఏవో మాటలు వినిపిస్తున్నాయి.

"ఎన్నాళ్ళు కవివర్యా ఇలా! రాజుగారూ అడుగుతున్నారు మీ గురించి." అందో ముసలి గొంతు.

"ఎన్నాళ్ళైతే ఏమున్నది ఆచార్యా? ఆమె తిరిగి వస్తుందనే నమ్మకముంది నాలో." అన్నాడు కాళీ.

ముందుకి జరిగి, చెవులు రిక్కించి వింటున్నాను.

"చూడు నాయనా, నేనూ అందరిలా, చారులత దుండగుల బారిన పడిందనో, అడవిలో ఏదో జంతువుకు ఆహారమైందనో, లేదా ఆత్మహత్య చేసుకుందనో చెప్పి చేతులు దులుపుకునేంత పిచ్చివాడిని కాదు."

"అవేవీ వాస్తవాలు కాదు కదా ఆచార్యా?"

"తెలుసు. అందుకే ఆమె జాతకాన్ని తెప్పించి క్షుణ్ణంగా పరిశీలించాను. ఆమెకి ఏ మృత్యుగండమూ లేదు. పూర్ణాయుష్కురాలు..."

"గొప్ప వార్త ఆచార్యా నాకిది! అయితే ఇక ఆమెని వెతికి వివాహం చేసుకోవడమే తరువాయి." అన్నాడు కాళీ ఉత్సాహంగా.

నా గుండె చప్పుడు బైటికి వినిపిస్తోందిప్పుడు. శరీరంలో అణువు కదలట్లేదు. అమాంతం కాళీ ముందు ప్రత్యక్షమైపోవాలనిపిస్తోంది.

"ఆమె బతికే ఉంది. ఈ చుట్టు ప్రక్కల ఏదో ఓ గ్రామంలోనో, నగరంలోనో ఉండి ఉంటుంది. ఇప్పటికే నీ గురించీ, నీ ఖ్యాతి గురించి తెలిసే ఉంటుంది. నీ నాటకాలూ చూసే ఉంటుంది." చెప్పుకు పోతున్నాడాయన అంతా తెలిసినట్టు.

"అయితే ఇప్పుడో ఇహనో నా దగ్గరికి రావచ్చు కూడా!" అన్నాడు కాళీ ఉత్సాహంగా.

"రాదు! ఆమె ఎప్పటికీ తిరిగి రాదు. ఎందుకంటే ఆమె కోరుకున్నదీ, కోరుకుంటున్నదీ అదే కాబట్టి."

నేలలో కూరుకుపోతున్నాను.

"మీ మాటలతో హృదయాన్ని చీల్చివేస్తున్నారు ఆచార్యా!"

"నువ్వు గొప్పవాడివవ్వడమే ఆమెకి సంతోషం నాయనా. నీకు కావ్యకన్యగా ఉండటానికి మించి, ఆమెకి ఏ ఆశా లేదు. అంతెందుకు, ఇవాళ, ఇప్పుడు ఈ నాటకాన్ని చూడటానికి వచ్చినా, నీ ముందుకి మాత్రం రాదు ఆమె. అంత ఉత్తమురాలయ్యా!"

నా ఊపిరి ఆగి చాలా సేపయ్యింది. చెంపల మీదుగా పడుతున్న వెచ్చటి నీటితో రవిక తడిసిపోతోంది. భయంతో కాళ్లు అక్కడే పాతుకు పోతున్నాయి. గుడారం లోపలి నుండి ఇంకేమి మాటలూ వినపడలేదు, ఓ పెద్ద నిట్టూర్పు తప్ప. ఆ నిట్టూర్పుతోనే గట్టిగా వెనక్కి నెట్టివేయబడ్డట్టు, ఈడ్చుకుంటూ అక్కడినుండి కదులుతున్నాను.

విశాలమైన శూన్యంలోకి నడిచాను...అదే సంతోషం నాకు.

అటుగా గాఢాంధకారంలోకి తిరిగాను...అంతకు మించి ఆశ లేదు నాకు.

దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తున్నానిప్పుడు...ఉత్తమురాలిని నేను.

దూరంగా ఆకాశంలో ఉల్క ఒకటి కదిలిపోతోంది.

"అమాయకురాలినేనా నేను?" అడిగాను దాన్ని.

Post your comments